సమ్మక్క జాతరకు ఏర్పాట్లు

- ఫిబ్రవరి 21 నుంచి ప్రారంభం
- పనులను పర్యవేక్షిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


ఇటీవల నీరుకుల్ల సమ్మక్క జాతర ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్: సమ్మక్క–సారలమ్మ జాతర కోసం ఏర్పాట్లను కార్యనిర్వహణ అధికారులు ముమ్మరం చేశారు. గోలివాడ, గోదావరిఖని ప్రాంతాల్లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్లు శ్యాంప్రసాద్‌లాల్, అరుణశ్రీ, మినీ మేడారంగా పిలవబడే నీరుకుల్ల జాతర పనులను పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా జాతర కమిటీల సభ్యులు, నిర్వాహకులు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

సౌకర్యాలు కల్పించాలి..

ఫైర్, వైద్యం, పోలీస్ ,రెవెన్యూ , ఎక్సైజ్, ఎండోమెంట్, ఆర్టీసీతో పాటు పలు శాఖల అధికారులను సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలని ఉన్నతాధికారులు స్థానిక అధికారులను ఆదేశించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయంలో ఉమ్మడి దేవాదాయ ధర్మాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఈవో, ఇతర అధికారులతో ఇటీవల సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో జరిగే అతిపెద్ద జాతర కావడంతో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులతో పాటు పాలకవర్గాలకు సూచించారు.

ఫిబ్రవరి 21 నుంచి జాతర

ఫిబ్రవరి 21 నుంచి 23 వరకు జరిగే జాతర కోసం ఏర్పాట్లు సర్పంచులు, పాలకవర్గాలు, జాతర కమిటీ అధికారులు పనులు వేగవంతం చేశారు. జిల్లాలో గోదావరిఖని, గోలివాడ, ఓదెల మండలం కొలనూరు, సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల, కొదురుపాకలో అధికారికంగా జాతర నిర్వహించనున్నారు.

జాతర కమిటీల నియామకం పూర్తి..

సమ్మక్క జాతర ప్రత్యేక కమిటీలను ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేల సిఫార్సు మేరకు జాతర ప్రత్యేక కమిటీలను దేవాదాయ శాఖ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. అధికారులతో పాటు అనధికారికంగా ఉన్న గ్రామాల్లో సైతం జాతర జరిగే ప్రాంతాలను చదును చేశారు.

నేడు సమ్మక్క జాతర కమిటీ సమావేశం

సుల్తానాబాద్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం 11 గంటలకు సమ్మక్క–సారలమ్మ జాతర ఏర్పాట్లపై సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. సమావేశానికి విద్యుత్, పోలీస్, పంచాయతీరాజ్, వైద్యం, ప్రజాప్రతినిధులు, సమ్మక్క–సారలమ్మ కమిటీ, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు, ప్రత్యేక అధికారులు ఏర్పాట్లపై సమీక్ష సమావేశానికి హాజరై జయప్రదం చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

పనుల్లో వేగం పెంచాలి



అధికారులు, ప్రజాప్రతినిధులు, జాతర కమిటీ సభ్యులు సమన్వయంతో జాతరను దిగ్విజయం చేసేందుకు పనిచేయాలి. ఇప్పటికే టెండర్లు పూర్తి చేసి పాలకవర్గాలు, అధికారులు పనులు వేగంగా చేస్తున్నారు. మరింత వేగం పెంచాల్సిన బాధ్యత అందరిపై ఉంది. జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేయాలి. – విజయరమణారావు, ఎమ్మెల్యే, పెద్దపల్లి

నిత్యం పర్యవేక్షిస్తున్న



ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న జాతర్లకు ప్రత్యేక అధికారులను నియమించారు. వారు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. రోజువారీగా నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తున్నాం. భక్తులకు ఇబ్బంది కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. – శంకర్, ఈవో, నీరుకుల్ల, దేవాదాయ ధర్మాదాయశాఖ

క్లుప్తంగా

ఐజేయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడికి సన్మానం


సన్మానిస్తున్న మార్నింగ్ వాకర్స్

రామగుండం: పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు కోల లక్ష్మణ్‌గౌడ్‌ను ఇండియన్ జర్నలిస్టు యూనియన్ (ఐజేయూ) రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమితులయ్యాడు. కాగా ఆదివారం ఉదయం జెన్‌కో క్రీడా మైదానంలో మార్నింగ్ వాకర్స్ సన్మానించారు. కట్కూరి శ్రావణ్‌కుమార్, అర్జున్ యాదవ్, ముంజా పూర్ణచందర్‌గౌడ్ ఉన్నారు.

రక్తదానం


రక్తదానం చేస్తున్న కార్పొరేటర్ ముస్తాఫా

కోల్‌సిటీ: గోదావరిఖనిలో ఓ మహిళకు ఆదివారం ఆపరేషన్ నిమిత్తం రక్తం అత్యవసరం కావడంతో సకాలంలో స్పందించిన 44వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ.ముస్తాఫా స్వచ్ఛందంగా ఆస్పత్రికి చేరుకొని రక్తదానం చేసి పలువురికి స్ఫూర్తిగా నిలిచారు. కాగా రక్తదాత ఇప్పటికే 24 సార్లు రక్తదానం చేసినట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ రక్తదాతను అభినందించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


వైద్యం చేస్తున్న డాక్టర్ సాగర్

సుల్తానాబాద్: పట్టణంలోని ఎస్వీఆర్ గార్డెన్‌లో నేచురల్ వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఆదివారం పలు ప్రాంతాల నుంచి రోగులు రాగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కరీంనగర్ వారి ఆధ్వర్యంలో ఆక్యుపంక్చర్, కప్పింగ్ తెరపీ, ఆక్యుప్రెజర్ పద్ధతిలో వైద్యం అందించారు. పతంజలి నిర్వాహకులు ఎల్లె మల్లేశం, బైరగోని రవీందర్, రాజేశ్ ఉన్నారు.

నేడు సమ్మక్క జాతర దుకాణాలకు వేలం


జూలపల్లి: మండలంలోని అబ్బాపూర్‌లో పోచమ్మగుట్ట వద్ద వెలసిన సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా ఏర్పాటు చేసే దుకాణాల వేలం సోమవారం యాదవ కమ్యూనిటీ భవనంలో నిర్వహించనున్నట్లు జాతర కమిటీ అధ్యక్షుడు పసునూటి శ్రీనివాస్ తెలిపారు. జాతరలో కొబ్బరికాయలు, బెల్లం, కూల్‌డ్రింక్స్, అమ్ముకునే హక్కుతో పాటు కొబ్బరిముక్కలు, తలనీలాలు పోగుచేసుకునేందుకు వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వ్యాపారులు వేలంలో పాల్గొనాలని కోరారు.

మల్లారం యువకుడికి సేవారత్న అవార్డు


అభినందిస్తున్న ప్రతినిధులు

మంథని: మంచిర్యాల జిల్లా కేంద్రంలో జూనియర్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సేవారత్న అవార్డుల్లో మంథని మండలం మల్లారం గ్రామానికి చెందిన యువకుడు పొట్ల శ్రీకాంత్‌కు సేవారత్న అవార్డు దక్కింది.

జాతర అడ్‌హక్ కమిటీ అధ్యక్షుడిగా తిరుపతి



ధర్మారం: మండల కేంద్రంలోని సమ్మక్క జాతర అడ్‌హక్ కమిటీ అధ్యక్షుడిగా వైస్ ఎంపీపీ మేడవేని తిరుపతిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సమ్మక్క ఆలయం వద్ద కమిటీ సభ్యులు ఆదివారం సమావేశమై కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా అర్ధవెల్లి రామ్, కోశాధికారిగా ఓరెం చిరంజీవి సభ్యులుగా తాటిపెల్లి ఈశ్వర్, నూనె సత్యనారాయణ, సోగాల తిరుపతి, మేడవేని వినోద్‌కుమార్, దేవి కిషోర్, మొద్దు శ్రీనివాస్, సోగాల వంశీ, కాంపెల్లి రాజేశం, కరేటి వేణుమాధవ్, మెడవేని హరీశ్, పెరుమాండ్ల మహిపాల్, నార ప్రేమ్‌సాగర్, బత్తిని రాజు, సతీశ్ పాల్గొన్నారు. కాగా సమ్మక్క జాతర ఉత్సవాల ఖర్చు కోసం స్థానిక కాంగ్రెస్ నాయకుడు జనార్దన్ రూ.25వేల విరాళం కమిటీ సభ్యులకు అందించారు.

గుర్తింపు పత్రం ఇవ్వడం లేదు


మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

గోదావరిఖని: సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరిగి నెల దాటినా ఏఐటీయూసీకి గుర్తింపు పత్రం ఇవ్వకుండా యాజమాన్యం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ)ఉప ప్రధాన కార్యదర్శి ఎల్లాగౌడ్, ఆర్జీ–1 బ్రాంచ్ సహాయ కార్యదర్శి రంగు శ్రీనివాస్ ఆరోపించారు. ఆదివారం స్థానిక భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన ఏఐటీయూసీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణిలో కారుణ్యం ద్వారా అన్‌ఫిట్ అయిన కార్మికుల డిపెండెంట్‌లు మెడికల్ ఫిట్ అయినా వీటీసీకి పంపేందుకు ఉద్యోగ నియామక పత్రాలు నాలుగు నెలలు గడిచినా ఇవ్వలేదని అన్నారు. అదేవిధంగా నిరుద్యోగులు, క్లర్కులు, కెమిస్టులు, ఇతర ఉద్యోగ నియామకాల్లో ఎంపిక చేసి ఒకరోజు డ్యూటీ చేసిన తర్వాత ఆర్డర్ కాపీ వాపసు తీసుకున్న యాజమాన్యం ఇంతవరకు ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఆర్జీ–1లో రిటైర్డ్ కార్మికులను క్వార్టర్ ఖాళీ పేరుతో వెకేషన్ సర్టిఫికెట్ ఇవ్వకుండా ఎస్టేట్ డిపార్ట్‌మెంట్ అధికారులు వేధిస్తున్నారని ఆరోపించారు. కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించకుంటే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.వెంకట్‌రెడ్డి, మిట్ట శంకర్, సోహెల్, ఎం.చక్రపాణి, మానాల శ్రీనివాస్, పర్లపల్లి రామస్వామి, ఎస్.రామకృష్ణారావు, ఉప్పులేటి తిరుపతి, ఎ.నగేశ్, పొన్నాల వెంకటయ్య, మల్లేశ్, రాజేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, చంద్రమోహన్, రాజయ్య, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి నంది అవార్డు అందజేత


అవార్డు అందుకుంటున్న శ్రీనివాస్‌బాబు

ఎలిగేడు: మండల కేంద్రానికి చెందిన చెల్లోజు శ్రీనివాస్ బాబు (రూపం ఆర్ట్స్)కు జాతీయస్థాయి నంది అవార్డును నిర్వాహకులు అందజేసినట్లు విశ్వకర్మ సేవా ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భాస్కరాచార్యులు, మోహన్‌రావు తెలిపారు. ఆదివారం హన్మకొండలో నిర్వహించిన ముగింపు సమావేశంలో అవార్డు ప్రదానం చేసినట్లు తెలిపారు.

జాతీయ అవార్డు ప్రదానం


అవార్డు ప్రదానం చేస్తున్న చైర్మన్ మోహన్‌రావు

సుల్తానాబాద్: పట్టణానికి చెందిన చిలుమోజు వీర నారాయణ ఆచార్యులుకు జాతీయ వాస్తు జ్యోతిష్య అవార్డును తెలుగు వెలుగు స్ఫూర్తి జ్యోతిష్యరత్న కమిటీ చైర్మన్ మోహన్‌రావు కోఆర్డినేటర్ రాజ్‌కుమార్ అందజేశారు. ఆదివారం హనుమకొండలో స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాలు–2024 సందర్భంగా అవార్డు ప్రదానం చేశారు.

బండ రవీందర్‌రెడ్డికి ఉత్తమ సర్పంచు అవార్డు


అవార్డు అందుకుంటున్న సర్పంచ్ రవీందర్‌రెడ్డి

కాల్వశ్రీరాంపూర్: యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ హైదరాబాద్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ మండలం లక్ష్మీపూర్ సర్పంచు బండ రవీందర్‌కు ఉత్తమ సర్పంచు అవార్డు అందించింది. హన్మకొండ టీఎన్‌జీ భవన్‌లో ఆదివారం నిర్వహించిన జాతీయ పురస్కారాల మహోత్సం సందర్భంగా గ్రామీణాభివృద్ధి సేవారంగంలో విశిష్ట సేవలందించిన రవీందర్‌రెడ్డికి తెలుగువెలుగు మహానంది జాతీయ గౌరవ పురస్కారం లభించింది. ఈ సందర్భంగా ప్రశంస పత్రం, మెమొంటో అందించి సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

చికిత్స పొందుతూ మృతి

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన ఆవుల కొమురయ్య(65) చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. శనివారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మరణించాడు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

మంథని: తెలంగాణ లేబర్ పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి ఇరుగురాల సంతోష్ ఆదివారం హైదరాబాద్‌లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు, మంత్రిపై నమ్మకంతో పార్టీలో చేరినట్లు ఆయన పేర్కొన్నారు.

అనాథలకు బెడ్‌షీట్స్ అందజేత

రామగుండం: స్థానిక రైల్వేస్టేషన్ ఎదుట ఎన్‌జీవోలతో నిర్వహిస్తున్న నైట్ షెల్టర్‌లో ఉన్న అనాథలకు ఆదివారం స్థానిక కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్ బెడ్ షీట్స్ అందజేశారు. కార్యక్రమంలో నైట్ షెల్టర్ నిర్వాహకుడు వెంకటయ్య, షేక్ ఇంతియాజ్, గౌస్ ఉన్నారు.

బోర్‌వెల్ ఏర్పాటు

ధర్మారం: మండలంలోని కటికెనపల్లి ఎంపీటీసీ సూరమల్ల శ్రీనివాస్ తన నిధుల నుంచి ఆదివారం రెండు బోర్‌వెల్‌లు ఏర్పాటు చేశారు. మండల పరిషత్ నిధులు రూ.3లక్షలతో ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఒకటి, స్థానిక శివాలయం వద్ద మరొకటి ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచ్ కారుపాకల రాజయ్య, నాయకులు రేండ్ల నరేశ్, చేపూరి లచ్చయ్య, బోనగిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

రామగిరి: మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన సులిగె లక్ష్మి ఇటీవల పాముకాటుకు గురికాగా చికిత్స కోసం రామగిరి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.6500, ఆదివారంపేట గ్రామానికి చెందిన కన్నూరి ఓదెలు అనారోగ్యంతో మృతి చెందగా మృతుని కుటుంబానికి మాజీ జెడ్పీటీసీ మైదం భారతి రూ.2వేలతో పాటు 25కిలోల బియ్యం అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు ములుమూరి శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి, గడ్డం శ్రావణ్‌కుమార్, బెల్లం శ్రీనివాస్, మేకల మారుతి, మైదం వరప్రసాద్, రాజేశం, విజయ పాల్గొన్నారు.

కమలపత్ర అవార్డు అందుకున్న లింగమూర్తి

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీకి చెందిన సింగరేణి కార్మికుడు, సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి కమలపత్ర అవార్డు అందుకున్నారు. లింగమూర్తి 15ఏళ్ల నుంచి అవయవదానంపై అవగాహన కల్పించడంతో పాటు ఆయన చేస్తున్న అనేక సామాజిక సేవలు గుర్తించి జూనియర్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ (జేసీఐ)సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మంచిర్యాల నస్పూర్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డు అందజేశారు.

అమృత కలశాల పంపిణీ

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ శ్రీసత్య సాయిబాబా భక్తులు, సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కేకేనగర్, సంతోష్‌నగర్ ఏరియాల్లోని నిరుపేద కుటుంబాలకు అమృత కలశాలను పంపిణీ చేశారు. కాలనీలోని 13 నిరుపేద కుటుంబాలకు అమృత కలశాల పేరుతో ఒక నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. సదాశయ ఫౌండేషన్ గౌరవ సలహాదారుడు నూక రమేశ్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, సభ్యులు రామకృష్ణారెడ్డి, నరసింహాచారి, దేవరెడ్డి పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ కోసం మార్కెట్ కార్యదర్శి దరఖాస్తు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ఎంపీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్నట్లు కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఈర్ల సురేందర్ తెలిపారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు అందించినట్లు చెప్పారు.

పరామర్శ

కమాన్‌పూర్: మండలంలోని పేంచికల్‌పేట గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎద్దు రాజయ్య అనారోగ్యంతో కరీంనగర్‌లోని ఓ ప్రవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా ఆదివారం జెడ్పీచైర్మన్ పుట్ట మధు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. రాజయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

అబ్బిడిపల్లె మాజీ సర్పంచ్‌కు యువచైతన్య అవార్డు



ఓదెల: మండలంలోని అబ్బిడిపల్లె మాజీ సర్పంచ్ కోమలత గ్రామాభివృద్ధి చేసినందుకు యువచైతన్య వెల్ఫేర్ సొసైటీ హైదరాబాద్ వారు యువచైతన్య అవార్డు అందించారు. స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాల సందర్భంగా జాతీయ పురస్కారాల మహోత్సవం సందర్భంగా అవార్డు అందజేసినట్లు నిర్వాహకులు వేములవాడ రాధిక, జొన్నగోని యాదగిరిగౌడ్ తెలిపారు.

యోగా సాధకుడికి బంగారు పతకం


గోల్డ్ మెడల్ అందుకుంటున్న మల్లేశం

ధర్మారం: కేంద్ర మాజీ మంత్రి వెంకటస్వామి స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం బెల్లంపల్లిలో నిర్వహించిన జాతీయస్థాయి యోగా పోటీల్లో ధర్మారం మండలం నందిమేడారం గ్రామానికి చెందిన శ్రీకృష్ణ యోగా సభ్యుడు మల్లేశం బంగారు పతకం సాధించినట్లు మామిడిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. మల్లేశంను యోగా సాధన సభ్యులు ఎలగందుల అశోక్, కవిత, మామిడిశెట్టి శ్రీనివాస్ భాగ్య, మల్యాల సత్యానారాయణ, కల్లెం స్వామిరెడ్డి అరుణ, ఎండీ సలీం, ఇప్పలపెల్లి సురేందర్, శ్రీనివాస్‌రెడ్డి, గంగన్న, గౌడ శేఖర్, ఎర్రోజుల శ్రీనివాస్, శ్రీధర్, సాగర్ అభినందించారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం


బియ్యం అందజేస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖనిటౌన్: నిరుపేద డయాలసిస్ పేషెంట్లకు సహృదయ ఫౌండేషన్, నీడ స్వచ్ఛంద సేవా సంస్థలు చేస్తున్న ఆర్థిక సహాయం అభినందనీయమని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే నివాసం మార్కండేయకాలనీలో 10మంది డయాలసిస్ పేషెంట్స్‌కి 25కిలోల పది బ్యాగులు, ఆర్థికసాయాన్ని సంస్థ నిర్వాహకులు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి మనాలిఠాకూర్, సహృదయ ఫౌండేషన్(యూఎస్ఏ) నిర్వాహకులు తాడివాక బిందు, నీడ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు పల్లెర్ల రమేశ్‌గౌడ్, నాయకులు చుక్కల శ్రీనివాస్, కార్పొరేటర్ మహంకాళి స్వామి, ఎండీ ముస్తఫా, గట్ల రమేశ్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

జ్యోతినగర్: బిజిగిరి షరీఫ్ రైల్వేస్టేషన్‌లో రైలు దిగుతుండగా ప్రమాదవశాత్తు జరిగిన ప్రమాదంలో కాలు కోల్పోయిన దుర్గం నాగేశ్వరావును రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పరామర్శించారు. ఆదివారం రాత్రి ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌లోని నాగేశ్వరావు నివాసంలో ఆయనను పరామర్శించారు. కార్యక్రమంలో పాతిపెల్లి ఎల్లయ్య, ఆసిఫ్ పాషా, భరత్‌గౌడ్, నర్సయ్య పాల్గొన్నారు.

కరాటే జాతీయ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న కరాటే మాస్టర్స్

జ్యోతినగర్: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఆర్యవైశ్య భవన్‌లో వెంకటస్వామి(కాకా) స్మారకార్థం విక్టరీ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కరాటే పోటీల్లో ఎన్టీపీసీ రామగుండం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. నేషనల్ టోర్నమెంట్‌లో కటాస్ విభాగంలో జపాన్ షిటోరియో కరాటే స్కూల్‌కు చెందిన విద్యార్థులు బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. బెల్లంపల్లి, చెన్నూరు ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, వివేక్ పాల్గొని బహుమతి అందించారు. పతకాలు సాధించడంపై కోచ్ కరాటే శ్రీనివాస్‌ను, జపాన్ షిటోరియో కరాటే స్కూల్ ప్రెసిడెంట్ శంకర్, సెక్రటరీ రమేశ్, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్స్ శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, నిదీష్ కుమార్, రోహిత్ కుమార్, సంజన, శుభశ్రీ, అభిజ్ఞను స్పందన క్లబ్ సెక్రటరీ త్రివేది, ఎన్టీపీసీ రామగుండం స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ బాణేష్‌రావు, చిరంజీవి, ఆదిత్య, వంశీకృష్ణ అభినందించారు.

కార్మిక సంక్షేమం కోసం పోరాడుతాం


ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న దేశవ్యాప్త సమ్మె తలపెట్టినట్లు పలు కార్మిక సంఘాల నాయకులు ముత్యంరావు, సునీల్, రమేశ్, విశ్వనాథం, అశోక్, చంద్రయ్య, రాములు పేర్కొన్నారు. పెద్దపల్లిలో ఆదివారం వారు మాట్లాడారు. ప్రజావ్యతిరేక విధానాలను మార్చుకోవాలని కేంద్ర పాలకులను డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించే యత్నాలను విరమించుకోవాలన్నారు. నాయకులు కుమారస్వామి, సత్యనారాయణరెడ్డి, సతీశ్, రవీందర్, భీమయ్య ఉన్నారు.

నేత్రదానం చేయడానికి ముందుకు రావాలి


అవగాహన కల్పిస్తున్న మహిళా ప్రతినిధులు

కోల్‌సిటీ: 'మనం మరణించినా నేత్రదానంతో ఈ లోకాన్ని మళ్ల మన కళ్లతో చూడొచ్చు' అని రామగుండం మగువ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ లక్ష్మీవాణి, సదాశయ ఫౌండేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి శశికళ అన్నారు. గోదావరిఖని జీఎం కాలనీలో ఆదివారం కాలనీ మహిళలకు నేత్ర, అవయవ, దేహదానంపై అవగాహన కల్పించారు. అవయవ దానంపై అపోహలు వీడి ప్రతి ఒక్కరూ మరణానంతరం నేత్రదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నేత్ర, అవయవదానం చేయడంలో మహిళలే ఎక్కువ సంఖ్యలో ముందుకు వస్తున్నారని కొనియాడారు. అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించారు.

బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యం


పార్టీలోకి ఆహ్వానిస్తున్న సునీల్‌రెడ్డి

గోదావరిఖని: రాబోయే ఎంపీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి స్థానిక సాయిలీల రెసిడెన్సీలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ నేత అయోధ్య రవీందర్, భజరంగ్‌దల్ జిల్లా కన్వీనర్ సంపత్ బీజేపీలో చేరారు. కాగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బల్మూరి వనిత, కందుల సంధ్యారాణి, వడ్డెపల్లి రాంచందర్, కొండపాక సత్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ మార్కెట్‌లో మృతదేహం గుర్తింపు


విచారణ చేస్తున్న పోలీసులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు సమీపంలోని సండే మార్కెట్ ప్రాంతంలో సుమారు 30–35 ఏళ్ల వయస్సు ఉన్న మృతదేహం ఆదివారం లభ్యమైందని ఎస్సై జీవన్ తెలిపారు. మేడిపల్లి సెంటర్ ఏరియాలో మూడు నెలలుగా హిందీలో మాట్లాడుతూ, భిక్షాటన చేసేవాడని, ఆదివారం మధ్యాహ్నం మృతి చెంది కనిపించాడని స్థానికుల సమాచారం మేరకు దర్యాప్తు చేపట్టామన్నారు. తెలుపు రంగులో ఉండి కోల ముఖం, జుట్టు, గడ్డం బాగా పెరిగి ఉందని, శరీరంపై బనియన్ మాత్రమే ఉందని, రగ్గు కప్పుకుని ఉన్నాడని పేర్కొన్నారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ శానిటరీ సూపర్‌వైజర్ వంగర సంపత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు. మృతుడి సమాచారం తెలిసిన వారు ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో ఫోన్ నంబర్లు 87126 56524, 87126 56526లో సంప్రదించాలని ఆయన కోరారు. మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్సై వివరించారు.

ఎన్‌వైకేఎస్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా అన్వేష్

సుల్తానాబాద్: మండలంలోని రెబ్బల్‌దేవ్‌పల్లి గ్రామానికి చెందిన ఊషణ అన్వేష్‌యాదవ్ నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ (ఎన్‌వైకేఎస్) జగిత్యాల జిల్లా అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా నియామకమయ్యారు. జిల్లాలో ఉన్న యువజన సంఘాలకు నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలు తెలిపి యువజన సంఘాలను గ్రామస్థాయిలో బలోపేతం చేస్తానన్నారు.

ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు

సుల్తానాబాద్: కాంగ్రెస్ తరఫున పెద్దపల్లి ఎంపీ టికెట్ ఇవ్వాలని పట్టణానికి చెందిన న్యాతరి శ్యాంసుందర్ దరఖాస్తు అందజేశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో దరఖాస్తు చేసినట్లు ఆయన తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి చెందిన తనకు పెద్దపల్లి ఎంపీ టికెట్ కేటాయించాలని ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్ కోరారు.